

కథ

# జీవితమా! నీకో సలాం

## దిలావర్

**క్యాలిఫోర్నియా రాష్ట్రంలో, సిలికాన్ వ్యాలీ సమీపంలో వున్నది ఫ్రీమాంట్ పట్టణం. అక్కడ మా కూతురు షంషాద్, అల్లుడు అజీజ్, మనవరాలు రేష్మ మౌరీ అవెన్యూ, లేక్‌వ్యూ అపార్టుమెంటులో వుంటున్నారు. వాళ్ళ ఆహ్వానం మేరకు నేనూ, మా ఆవిడా ఇండియా నుండి అమెరికాకు వచ్చాం.**

రేష్మ పుట్టినరోజు వస్తోంది. ఇక్కడ పుట్టిన రోజులు, పెళ్ళి రోజులు, నూతన గృహప్రవేశాలు, పార్టీలు చాలాఘనంగా జరుగుతాయని మా అమ్మాయి చెప్పింది. రెండు మూడు రోజులు ముందునుండే మా అమ్మాయి, అల్లుడూ హడావుడి చెయ్యడం మొదలెట్టారు. రేష్మాకు కొత్త డ్రెస్ కొనుక్కొచ్చారు. 'సేఫ్‌వే'లో కేక్ ఆర్డరిచ్చారు. కాస్కో నుండి గిఫ్టులు, గుడీ బ్యాగ్‌లు తెచ్చారు. పీజాహట్‌లో పీజాలు ఆర్డరిచ్చారు.

నేనూ మా ఆవిడా కలసి ఇంటిని అందంగా అలంకరించాం. గోడకు 'హేపీబర్త్‌డే' అన్న అక్షరాలు వేలాడదీశాం. సీలింగ్‌కు ఏటవాలుగా క్రేప్ రిబ్బన్లు మెలితిప్పి కట్టాం. అక్కడక్కడా రంగు రంగు బెలూన్లు వేలాడదీశాం. ఇంటికి కొత్త కళ వచ్చింది.

పుట్టినరోజు రానేవచ్చింది. మా అమ్మాయి రకరకాల ఇండియా ఫలహారాలు చేయటంలో మునిగిపోయింది.

"ఎవరెవరు గెస్టులొస్తున్నారు?" అని రేష్మాను అడిగాను.

అపార్టుమెంటుకు చెందిన కొందరు కుటుంబాలతో వస్తున్నారని, తన క్లాస్‌మేట్స్ కూడా వస్తున్నారని రేష్మా చెప్పింది.

సాయంత్రం ఐదు గంటలయింది.

ఒక్కొక్కరే రావటం ప్రారంభమైంది.

"అబ్బాజాన్! వీరు డాక్టర్ సత్య, కర్నాటక" అని పరిచయం చేసింది మా అమ్మాయి షంషాద్.

"నమస్తే" అన్నాను.

"వీరికి సాహిత్యమంటే చాలా యిష్టం. మీ కవితలు కొన్ని చదివింది" అన్నది షంషాద్.

అవునా? అన్నట్టు చూశాను సత్యవేపు.

"అవునండీ! చాలా బావున్నాయి. మీరొస్తున్నట్టు షంషాద్ చెప్పింది. మిమ్మల్ని చూసినందుకు సంతోషంగా వుంది" అన్నది చక్కని తెలుగులో డాక్టర్ సత్య.

"నాక్కూడా" అన్నాను ముక్తసరిగా, ఏం చెప్పాలో తోచక.

మరికొంచెంసేపటికి ముంబైకి చెందిన రాధ వచ్చింది వాళ్ళ అమ్మాయితో సహా. వాళ్ళ అమ్మాయి ఇక్కడి యూనివర్శిటీలో సైకాలజీ చదువుతున్నదని పరిచయం చేసింది.

నేను ఆసక్తిగా ఆఅమ్మాయితో మాట్లాడాను.

కేరళ, తమిళనాడు, గుజరాత్‌కు చెందిన వాళ్ళు కూడా వచ్చారు. మూడు కుటుంబాల తెలుగువారు వచ్చారు. సంప్రదాయ కట్టు, బొట్టుతో కొందరు, జీన్స్, షార్ట్సు వేసుకొని కొందరూ కనిపించారు. అంతా ముందు హాల్లో సోఫాల మీద ఆసీనులయ్యారు. చోటు చాలక కొందరు కింద పరిచిన చాపల్లో కూచున్నారు.

షంషాద్ అందరికీ వడలూ, పకోడీ కొత్తిమీర చట్నీతో కలిపి వడ్డించింది. ఇక్కడివారు కొత్తిమీర చట్నీ బాగా యిష్టపడతారట. తరువాత పేపర్ ప్లేట్లలో పీజాలు పెట్టి యిచ్చింది. పిల్లలు పీజాలను చాలా యిష్టంగా తింటారట. తినటం అయ్యాక అందరికీ జ్యూస్ యిచ్చింది.

ఇంతలో బిలబిలమంటూ రేష్మ క్లాస్‌మేట్స్ వచ్చారు. అంతా టీనేజ్ అమ్మాయిలే. వారికి స్నాక్స్ యిచ్చాక రేష్మ కొవ్వొత్తులు ఆర్పి, కేక్ కట్ చేసింది. అంతా 'హేపీ బర్త్‌డే టూయూ' పాడుకుంటూ క్లాప్స్ కొట్టారు. కెమెరాలు క్లిక్కుమన్నాయి. వీడియో తీశారు.

హాల్లో యిరుకుగా వుందని వెనక వున్న బెడ్ రూంలోకి వెళ్ళి కూచున్నాను నేను.

కొంచెం సేపటికి రేష్మ తన క్లాస్‌మేట్స్‌తో వచ్చి "మా గ్రాండ్‌పా" అని నన్ను పరిచయం చేసింది.

"హాయ్!" అంటూ విష్ చేశారు అంతా.

"హాయ్!" అన్నాను బదులుగా.

విశాలంగా వున్న బెడ్‌రూంలోని రెండు బెడ్‌ల మీద సర్దుకొని కూచున్నారంతా.

కొంచెంసేపు అంతా మౌనంగానే వున్నాం.

బెడ్‌రూంను పరిశీలిస్తున్నారు వాళ్ళు. టీపాయ్ మీద అందంగా అలంకరించిన 'లోటస్ బొకే' (ప్లాస్టిక్‌ది)ను ముట్టుకొని చూశారు.

షెల్ఫ్‌లో వున్న బార్బీ బొమ్మల్నీ, టెడ్డీబేర్‌ను, మంకీ డాగ్ బొమ్మల్నీ, బొమ్మ గిటార్నీ, పియానోను, బైక్, ప్లేన్లను ఉత్సాహంగా చూశారంతా. స్టూలుమీద ఇండియా నుండి నేను తెచ్చుకున్న కొన్ని తెలుగు పుస్తకాలున్నాయి.

వాటిని పట్టుకొని అటూ యిటూ తిప్పి చూసి అక్కడ పడేశారు.

"ఏయ్! దయ్యాల్లాగా అలా చప్పుడు చెయ్యకుండా వున్నారేంటే? ఏమన్నా పాటలు పాడుకోవచ్చు కదా?"అన్నది రేష్మ ఇంగ్లీషులో.

మా సంభాషణలన్నీ ఇంగ్లీషులోనే జరిగాయి.

"ఒ.కే." అని గొంతు సవరించుకుంది ఓ అమ్మాయి. ఆ అమ్మాయి వేపు చూశాను. చిన్న చిన్న చీమ కళ్ళు. సట్టిముక్కు, బూరెల్లా ఉబ్బిన బుగ్గలు, బేబీ కటింగ్ హెయిర్‌స్టైల్. జీన్స్ ప్యాంటు, స్లీవ్‌లెస్ స్కర్టు వేసుకొని తెల్లగా, బొద్దుగా, ముద్దుగా వుంది ఆ అమ్మాయి.

"యాంకీ డూడుల్ కీపిటప్/యాంకీ డూడుల్ డాండీ

మైండ్ ది మ్యూజిక్ అండ్ ది స్టెప్/అండ్ విత్ ది గర్ల్స్ బీ హ్యాండీ" అని సన్న గొంతుతో తమాషాగా వూగుతూ పాడింది ఆ అమ్మాయి.

"వెల్‌డన్!" సంతోషంతో చప్పట్లు కొట్టింది రేష్మ.

"ఒసేయ్ పిల్లదయ్యమా! నువ్వు ఇవ్వాళే పుట్టావ్ కదా? పాటల సంగతి నీకేం తెలుసు? యాంకీలాగే పాడింది ఇది కూడా. ఇక్కడ కూడా ఆ చెత్త రైమ్స్ ఏంటే...?" జుట్టు పీక్కుంది ఇంకో అమ్మాయి.

ఆ అమ్మాయి వేపు చూశాను. పెద్ద పెద్ద కళ్ళు. చందమామలాంటి ముఖం. అర్ధచంద్రాకారంలో వున్న కనుబొమలు. కమీజ్ సల్వార్‌లో తెల్లగా, ఆకర్షణీయంగావుంది అమ్మాయి.

"పోనీ... నువ్వు పాడు ఓ మంచిపాట" అన్నది రేష్మ.

కొంచెంసేపు మౌనంగావుండి "ఇది డాన్స్ చేస్తే నేను పాడుతా" అంది పక్కనున్న అమ్మాయిని మోచేత్తో పొడుస్తూ.

"ఓ.కే." అంది పక్కనున్న అమ్మాయి.

నా కళ్ళు అటు తిరిగాయి.

సోగకళ్ళు, కోలముఖం, కొనదేలి చాకులా వున్న ముక్కు, నెలవంక లాంటి కనుబొమలు, గులాబీ పెదవులు, కూజాలాంటి కంఠం, ముఖం మీదికి తోసుకొచ్చిన ముంగురుల పాయ, మూడు నాలుగు రింగులు ఒక దానిలో ఒకటి దూర్చి గ్లోబ్ ఆకారంలో చేసిన రింగులు చెవులకు ధరించి, బంగారు వన్నె కమీజ్ సల్వార్‌లో బంగారు చాయతో వెలిగిపోతున్నది ఆ పొడవాటి అమ్మాయి. స్టన్నింగ్ బ్యూటీ అంటే యిదేనేమో! నా కళ్ళు తిప్పుకోలేకపోయాను.

ఆ అమ్మాయి ముందుగా హాల్లోకి తొంగి చూసింది.

అక్కడంతా జోకులు కట్ చేస్తూ, నవ్వుతూ డిన్నర్ పూర్తి చేస్తున్నారు. బెడ్‌రూం తలుపులు మూసేసి "ఊఁ పాడు..." అంది పెద్దకళ్ళ అమ్మాయితో చున్రీని బెడ్‌మీదికి విసిరేస్తూ.

పెద్ద కళ్ళ అమ్మాయి పాట అందుకుంది.

"ఆజ్‌కి లడ్‌కీ ఐ టెల్ యూ

కిత్‌నీ లడ్‌లూ వాట్ టూ డూ

కోయి ముఝె బోలె హౌ ఆర్ యూ

కోయి ముఝె పూఛె హౌడూయూడూ...

హల్లో డార్లింగ్...ఐ...లవ్ యూ..."

పాట సాగుతున్నంతసేపు లయ కనుగుణ్యంగా హావభావాలు ప్రదర్శిస్తూ డాన్స్ చేసింది ఆ నాజూకు పొడగాటి అమ్మాయి.

"మార్వలెస్!" అన్నాను ఎక్సైట్‌మెంట్‌ను ఆపుకోలేక చప్పట్లు కొడుతూ.

"హల్లో డార్లింగ్ ఐ లవ్ యూ..." అంటూ కన్ను గొట్టి ఆ పొడగాటి అమ్మాయిని కవ్వించింది బొద్దుగా వున్న అమ్మాయి.

"ఐ టూ డార్లింగ్..."అంటూ ఆ అమ్మాయిని బెడ్‌మీద పడేసి ముద్దుల వర్షం కురిపించింది పొడగాటి అమ్మాయి.

"యూ నాటీ...నీకు రొమాన్సు ముదిరిపోతున్నదే. ఎవడైనా బోయ్‌ఫ్రెండ్‌ను చూస్కో త్వరగా" అన్నది మొఖం తుడ్చుకుంటూ బొద్దుగా వున్న అమ్మాయి.

"నువ్వుండగా ఎవడో ఎందుకే?" అని మళ్ళీ ముద్దు పెట్టుకుంది పొడగాటి అమ్మాయి.

"ఛీ ఫోవే... నీకు బొత్తిగా సిగ్గు లేదు" అని ఆమెను తోసేసింది బొద్దుగా వున్న అమ్మాయి.


"నువ్వో పాట పాడు బేబీ!" అన్నాను పొడుగమ్మాయితో.

"ఏయ్...కమాన్!" అని పెద్ద కళ్ళ అమ్మాయినీ, మా రేష్మను పిలిచింది ఆమె.

ముగ్గురూ "డోలారే...డోలారే...డోలారే..." అని పాడుకుంటూ ఐష్‌ను, మాధురినీ అనుకరిస్తూ డాన్స్ చేశారు.

చప్పట్లతో రూం మారుమోగింది.

ఈసారి ఎవరూ అడక్కుండానే తను ఒక్కతే డాన్స్ చేయటానికి సిద్ధమైంది పొడగాటి అమ్మాయి.



కాళ్ళు రెండూ వెనక్కి ఓ పక్కగా మలచి ఏటవాలుగా కూచొని చున్‌రీని భుజాల మీదుగా ముఖం మీద కప్పుకుంది. ఎడమ పక్కన కూచున్న నావేపు, చున్‌రీలోంచి ఓ కొంటెచూపు విసిరి ఎలా వున్నాను అన్నట్టుగా కను బొమలు ఎగరేసింది.

ఆ అమ్మాయి చిలిపితనానికి మనసులోనే నవ్వుకున్నాను కాసేపు నా వయసు పక్కనపెట్టి.

చేతులు ముందుకు చాపి "మారిడాలా...మారిడాలా..." అని గొంతెత్తి పాడుతూ అభినయించింది.

ఇక్కడికి లాస్ ఏంజిల్స్ దగ్గరే. ఏ హాలీవుడ్డోడైనా చూస్తే ఈ అమ్మాయిని ఎత్తుకుపోవటం ఖాయం అనుకున్నాను మనసులో.

"అప్పుడే అంతగా చంపేస్తున్నాడానే... మీ వాడు?" అంది బొద్దుగా వున్న అమ్మాయి.

"ఏయ్ మగరాయుడూ...నీ అనుమానం బుద్ధి పోనిచ్చుకున్నావ్ కాదు" అని మాటకు మాటా అంటించి ఆ అమ్మాయి మీద పడింది.

ఒకళ్ళ నొకళ్ళు గిచ్చుకోవటమే కాదు,

ముద్దుపెట్టుకోవటమే కాదు, తోసుకోవటమే కాదు, వికవికలే కాదు, పకపకలే కాదు... వాళ్ళఆనందానికి హద్దే లేదనిపించింది.

వయసుతోపాటు వచ్చే అల్లరి, చిలిపితనం, తుళ్ళింతలు, కవ్వింతలు, విరగబాటు, మిడిసిపాటు, పొగరుమోత్తనం.... అన్నీ అమ్మాయిలకు అదనపు అలంకారాలుగానే శోభిస్తాయేమో...

నేను కూడా వాళ్ళతోబాటు పసిపిల్లాడిలా కేరింతలు కొడుతూనే వున్నాను.

ఇంతలో మా రేష్మ "తాతయ్యా! ఈ అమ్మాయి పేరు రొవైదా... ఆఫ్ఘనిస్తాన్ అమ్మాయి..." అని పొడగాటి అమ్మాయి వేపు చూపిస్తూ పరిచయం చేసింది.

"వ్వాట్...?" నేను నిటారుగా అయ్యాను ఆశ్చర్యంతో.

"రొవైదా! ఆఫ్ఘనిస్తాన్‌లో మీరుండేదే ప్రాంతం?" కుతూహలంతో అడిగాను.

"కాబూల్" అంది రొవైదా.

వెంటనే టాగోర్ 'కాబూలీవాలా' గుర్తొచ్చాడు.

"మీరే భాష మాట్లాడుతారు?"

"పాష్తో"

"అక్కడ మూవీలు చూస్తారా?"

"నో. అక్కడ మూవీలుండవు"

"ఇక్కడ చూస్తారా?"

"డీవీడీలు వేస్కొని చూస్తాం ఇంట్లోనే"

"ఏ మూవీలు చూస్తారు?"

"ఎక్కువగా హిందీవి. అప్పుడప్పుడు యింగ్లీషువి"

"ఏమేం చూశావ్?"

"లగాన్... దేవదాస్... మమ్మీ... టైటానిక్... స్పైడర్‌మాన్..." జ్ఞాపకం చేసుకుంటూ చెప్పింది.

"హిందీ హీరోలు ఎవరు తెలుసు?" అని అడిగాను.

"అమితాబ్ బచ్చన్" చేతులు పైకెత్తి పొడగరితనాన్ని సూచిస్తూ అన్నది.

"తాలిబాన్ల గురించి తెలుసా?" సూటిగా రొవైదా కళ్ళలోకి చూస్తూ అడిగాను.

రొవైదా కొంచెం తడబడింది.

"పూర్తిగా తెలియదు... మా డాడ్ చెబుతుంటాడు" నేలకు చూస్తూ అన్నది.

తాలిబాన్లు... వారి విధ్వంసం... స్త్రీల పట్ల వారి కర్కశత్వం... విధించిన ఆంక్షలు...జారీ చేసిన ఫత్వాలు... కరడు కట్టిన వారి ఛాందసత్వం... ఉగ్రవాదం... బిన్ లాడెన్... యుద్ధాలు... అన్నీ ఓ క్షణం నా మనసులో మెదిలాయి. కానీ యివన్నీ యీ పసిమనసులకేం తెలుసు...?

పెద్ద కళ్ళమ్మాయి వేపు చూపిస్తూ "తాతయ్యా! ఈ అమ్మాయి పేరు మహనూర్, పాకిస్తానమ్మాయి" అని మరొక బాంబు పేల్చింది రేష్మ.

తను ఇస్లామాబాదు నుండి వచ్చిందని, తండ్రి హెల్త్ ప్రోగ్రామర్ అనీ, అన్నయ్య ఇక్కడే ఓ బిజినెస్ కంపెనీలో పని చేస్తున్నాడనీ, అక్క సేల్స్ గర్ల్‌గా పని చేస్తున్నదనీ గడగడా చెప్పింది మహనూర్.



"ఇండియాతో పాకిస్తాన్ చేస్తున్న యుద్ధం తెలుసా?" అని అడిగాను మహనూర్‌ను.

"ఉహూ... ఏదో వార్ గురించి యింట్లో చెప్పుకుంటారు" అంది అనాసక్తిగా.

నిత్యం నెత్తురోడే కాశ్మీర్ లోయ...ఐఎస్ఐ ఏజెంట్లు... లష్కర్- ఏ- తోయిబా... అంతర్జాతీయ ఉగ్రవాదం...కార్గిల్ వరకూ జరిగిన పోరాటాలు... నా మనసులో గిరగిరా తిరిగాయి.

వీటికీ మహనూర్‌కు ఏమిటి సంబంధం?

**ఒకళ్ళ నొకళ్ళు గిచ్చుకోవటమే కాదు, ముద్దుపెట్టుకోవటమే కాదు, తోసుకోవటమే కాదు, వికవికలే కాదు, పకపకలే కాదు...వాళ్ళ ఆనందానికి హద్దే లేదనిపించింది. వయసుతోపాటు వచ్చే అల్లరి, చిలిపితనం, తుళ్ళింతలు, కవ్వింతలు, విరగబాటు, మిడిసిపాటు, పొగరుమోత్తనం....అన్నీ అమ్మాయిలకు అదనపు అలంకారాలుగానే శోభిస్తాయేమో... నేను కూడా వాళ్ళతోబాటు పసిపిల్లాడిలా కేరింతలు కొడుతూనే వున్నాను.**

"ఈ అమ్మాయి పేరు జాకీ చాంగ్. చైనా హాంగ్‌కాంగ్ నుండి వచ్చింది" మెరుపు తీగలా వున్న అమ్మాయి వేపు చూపిస్తూ ఇంకో బాంబు పేల్చింది రేష్మ.

ఆ అమ్మాయితో కాసేపు మాట్లాడాను.

చైనా అగ్రెషన్...అప్పుడు జరిగిన రిట్రెంచిమెంటు...నా వుద్యోగం వూడిపోవటం... అన్నీ జ్ఞాపకమొచ్చాయి...

నా వుద్యోగం వూడిపోవటానికి ఈ మెరుపు తీగ కారణమా?

బొద్దుగా వున్న అమ్మాయిని చూపిస్తూ "ఈ అమ్మాయి పేరు ఎరికా, జపాన్" అన్నది రేష్మ.

"అలాగా" అన్నాను తల వూపుతూ.

"ఈ అమ్మాయి మెక్సికన్, పేరు మిషెల్. నాకు స్పానిష్ నేర్పిస్తున్నది. ఇదిగో ఈ అమ్మాయి ఫిజీ నుండి వచ్చింది. హిందీనే మాట్లాడుతుంది, సురీనా. ఇది శ్వేత, మళయాళీ. ఇది ఆర్తిక, గుజరాతీ..." అంటూ అందరినీ వరుసగా పరిచయం చేసింది రేష్మ.

తన క్లాస్‌మేట్స్ వస్తున్నారని రేష్మా చెబితే నేను ఇండియాకు చెందినవారే అనుకున్నా. కానీ వివిధ దేశాలకు చెందిన వారిని యిక్కడ చూస్తుంటే థ్రిల్లింగానే వుంది.

ఇంతలో దబదబా తలుపు చప్పుడైంది.

"డిన్నర్ తీసుకొని అంతా వెళ్ళిపోయారు. ఇక మీరే మిగిలారు" అంటూ మా అమ్మాయి షంషాద్ అందర్నీ పిలిచింది.

"మీరు కూడా రండి అంకుల్" అంటూ రొవైదా తలుపు తీసింది.

అంతా హాల్లోకి వెళ్లి, డైనింగ్ టేబిల్ మీదున్న వెజ్, నాన్‌వెజ్ ఐటమ్స్ అన్నీ కలగలిపి లాగించేశాం.

రేష్మ గుడీ బ్యాగ్‌లలో గిఫ్టులు పెట్టి తలా ఒకటి యిచ్చింది.

అందరికీ 'బై' చెప్పి అమ్మాయిలంతా వెళ్ళిపోయారు.

మా వాళ్ళు ఇల్లు సర్దుకోవటంలో మునిగిపోయారు.

నేను బెడ్‌రూంలోకి వెళ్ళి నడుం వాల్చాను.

ఆలోచనలు ఒక్కుమ్మడిగా నన్ను ముసురుకున్నాయి... అవసరం ఎలాంటి వారితోనైనా... ఎంతటి అసాధారణమైన పనులనైనా చేయిస్తుంది.

సింహం నోట్లో తల దూర్చగలదు. పులి, జింక ఒకే రేవులో నీళ్ళు తాగుతాయి. మేక, చిరుత ఒక్క బోనులోనే జీవనం కొనసాగిస్తాయి. అవసరం మనిషిని కక్షలకు, కార్పణ్యాలకు, వైరానికీ, పగలకూ అతీతంగా... సముద్రాలు దాటి, ఖండాంతరాలలో... సాటి మనుషుల్తో కలిసి వుండేట్టు చేస్తుంది. ఆ అవసరాలకు పుట్టినిల్లయిన జీవితమా! నీకో సలాం... అని నాలో నేను అనుకుంటూ నిద్రలోకి జారిపోయాను. ●